క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

జాతీయస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు

పరవాడ: మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు హెచ్.కుమార్, కె.తనీష్‌సాయి, ఎం.లక్ష్యలు జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని హపూర్ జిల్లా ఘరముక్తేశ్వర్‌లో ఈ నెల 27న జరగనున్న 33వ జూనియర్ జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీల్లో సదరు విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను, కోచ్ రాజేష్‌ను పాఠశాల సీఈవో కె.నిశాంత్, ప్రిన్సిపాల్ అభినందించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష అభిషేకాలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో కొలువుదీరిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం విశేషంగా పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

కలెక్టర్‌ను కలిసిన సమాచార శాఖ డీడీ



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సమాచార శాఖ డీడీ సదారావు

మహారాణిపేట: సమాచార పౌర సంబంధాల శాఖ విశాఖ కార్యాలయ ఉప సంచాలకులుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె. సదారావు మంగళవారం కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, జర్నలిస్టుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు, అక్రిడిటేషన్ల వ్యవహారాలు, ఇతర అంశాల్లో అనుసరించాల్సిన విధానాలపై సదారావుకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. సమన్వయంతో వ్యవహరించాలని, స్నేహపూర్వక వాతావరణంలో పని చేసుకోవాలని సూచించారు.

మూలకు చేరిన ఏటీఎంలు



పనిచేయని ఏటీఎం, పార్ట్‌లు విప్పేసి వదిలేసిన ఏటీఎం

అగనంపూడి: అగనంపూడిలోని భారతీయ స్టేట్ బ్యాంక్ ఏటీఎంలు మూలకు చేరాయి. కొద్ది రోజులుగా ఇక్కడ ఏర్పాటు చేసిన ఏటీఎంల్లో ఒకటి పనిచేయకపోగా, మరో ఏటీఎం పార్ట్‌లు విప్పేసి చెల్లా చెదురుగా పడి ఉండడంతో ఏటీఎంకి వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. పెన్షనర్లు, సాధారణ ఉద్యోగులు, అత్యధిక నిర్వాసితులు ఏటీఎంపై ఆధారపడి డబ్బులు విత్‌డ్రా చేసుకుంటున్నారు. అయితే అగనంపూడిలో ఉన్న ఏకైక ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో రెండు మిషన్లు కూడా మూలకు చేరడంతో ఎస్‌బీఐ ఖాతాదారులు మండిపడుతున్నారు. ఒకటి కాకపోతే ఒకటైనా పనిచేస్తుందని ఎంతో ఆశతో వచ్చేవారికి నిరాశ మిగులుతుండడంతో సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గుబులు రేపుతున్న.. గ్రామ సింహాలు

రంగస్థలంపైకి అకస్మాత్తుగా కుక్క ప్రవేశిస్తే.. ఓ శునకరాజమా ! నీకూ కూడా నేను లోకువయ్యానా? అంటూ పలికిన ఆంధ్ర నాటకరంగ ప్రభాకరుడు బళ్లారి రాఘవంతటి సమయస్ఫూర్తి నియోజకవర్గ ప్రజలు అలవరచుకోవాలేమో..! జీవీఎంసీ తీరు చూస్తే నిజమేననిపిస్తోంది. కుక్కల నియంత్రణను పూర్తిగా గాలికొదిలేసినట్టుంది. వీధులు, రోడ్లపై గుంపులుగా చేరి జనాలను వెంటాడుతున్నా.. పట్టించుకునే పరిస్థితి లేదు. రోజూ పదుల సంఖ్యలో కుక్కకాటు బాధితులు ఆస్పత్రుల్లో చేరుతున్నారు.

- పెందుర్తి ప్రాంతంలో పెరుగుతున్న కుక్కలు బెడద
- పీహెచ్‌సీకి రోజుకు 20-30 మంది కుక్కకాటు బాధితులు
- చర్యలకు వెనుకాడుతున్న జీవీఎంసీ యంత్రాంగం



పెందుర్తి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో యథేచ్ఛగా తిరుగుతున్న శునకాలు

పెందుర్తి: కుక్కలు వేటాడేస్తున్నాయి. మనుషుల వెంటపడి గాయపరుస్తున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్న తేడాలేకుండా జనాల్లో అలజడి రేపుతున్నాయి. గ్రామ సింహాల కోపానికి రోజూ పదుల సంఖ్యలో ప్రజలు గాయాలపాలవుతున్నారు. కుక్కల నియంత్రణలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో కుక్కకాటు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. నియోజకవర్గ పరిధిలోని ఆస్పత్రులకు నిత్యం 20-30 మంది బాధితులు వస్తుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తుంది. ఒక్క పెందుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలోనే నెల రోజుల వ్యవధిలో 200 వరకు కేసులు నమోదయ్యాయి.

పెరుగుతున్న కుక్కలు

పెందుర్తి ప్రాంతంలో ముఖ్యంగా జీవీఎంసీ విలీన ప్రాంతాల్లో రోజురోజుకూ శునక రాజ్యం విస్తరిస్తోంది. దాదాపు ప్రతి కాలనీలో పదుల సంఖ్యలో కుక్కలు తిష్ట వేశాయి. ఇతర ప్రాంతాల్లో పట్టుకున్న కుక్కల్ని ఇక్కడ విడిచిపెడుతుండటంతో వీటి సంఖ్య మరింతగా పెరుగుతోందని స్థానికుల ఆరోపణ. నగరంలో పట్టుకున్న కుక్కలను జీవీఎంసీ సిబ్బంది పెందుర్తి ప్రాంతంలో విడిచిపెడుతున్నారు. ఇవి పగలూ రాత్రీ తేడా లేకుండా ప్రజలపై దాడులకు దిగుతున్నాయి. ముఖ్యంగా పారిశుధ్య కార్మికులు, విద్యార్థులు ఉదయం పూట ఎక్కువగా కుక్కకాటుకు గురవుతున్నారు. ఇక సాయంత్రం వేళల్లో వాకర్స్, మహిళలపై శునకాలు దాడులకు దిగుతున్నాయి. వాహనాలపై వెళుతున్నవారిని వెంబడించడంతో ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. పెందుర్తి గ్రామీణం, పరవాడ, సబ్బవరం ప్రాంతాల్లో కూడా కుక్కల బెడద పెరిగిపోయింది. వర్షాకాలం కావడంతో పౌల్ట్రీల వ్యర్థాలు తిని కుక్కలు పిచ్చెక్కినట్లు ప్రవర్తిస్తున్నాయి. జనావాసాల్లో తిరుగుతూ ప్రజలపై దాడులకు దిగుతున్నాయి.

నియంత్రణ చర్యలు శూన్యం

వాస్తవానికి జనావాసాల్లో తిరుగుతున్న కుక్కలను చంపే అవకాశం లేదు. అయితే ఇక్కడ తిరుగుతున్న కుక్కలను పట్టుకుని బయటకు తరలించాలి. దీనికితోడు కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్లతో పాటు, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు కూడా చేయాలి. కానీ ఆయా ప్రతిపాదనలు ప్రకటనలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. కనీసం నెలలో రెండు సార్లు ప్రత్యేక డ్రైవ్ ద్వారా కుక్కలను పట్టాల్సి ఉండగా ఈ మధ్యకాలంలో అటువంటి చర్యలు చేపట్టిన దాఖలాలే లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నియంత్రణకు చర్యలు



కాలనీల్లో కుక్కల సంచారంపై ఫిర్యాదులు వస్తున్నాయి. మా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. జనావాసాల్లో తిరుగుతున్న కుక్కల్ని పట్టుకుని తరలించే ప్రక్రియ చేపడతాం. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో కుక్కలకు కుటుంబ నియంత్రణ చర్యలు చేపడుతున్నాం.

–కె.హేమావతి, జోనల్ కమిషనర్, జోన్–8

నాటు వైద్యం వద్దు



కుక్క కాటుకు గురైన సమయంలో నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. ఇది ప్రమాదకరం. వెంటనే గాయాన్ని సబ్బుతో శుభ్రం చేసి ఆస్పత్రికి తీసుకురావాలి. తగు మోతాదులో వ్యాక్సిన్ వేస్తాం. ప్రస్తుతం కుక్క కాటు వ్యాక్సిన్ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంది.

–డాక్టర్ అవంతి, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, పెందుర్తి

పాఠశాల క్రీడా మైదానంలో శ్రమదానం



సరిపల్లి పాఠశాల క్రీడా మైదానంలో శ్రమదానం చేస్తున్న సర్పంచ్ రామకృష్ణ, ఉపాధి హామీ కూలీలు

పెందుర్తి: సరిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం స్థానిక మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ కూలీలు శ్రమదానం నిర్వహించారు. సర్పంచ్ గొర్లె రామకృష్ణ ఆధ్వర్యంలో క్రీడా మైదానంలో పెరిగిపోయిన తుప్పలు, డొంకలను తొలగించారు. గ్రామ పెద్దలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న కళాశాల సిబ్బంది

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతోంది. మంగళవారం 50,001 ర్యాంక్ నుంచి 68 వేల ర్యాంక్ వరకు ఉన్న విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియను ఈ నెల 30కి వాయిదా వేసినట్లు తెలిపారు.

పచ్చిరొట్ట ఎరువులతో నేల మరింత సారవంతం



రైతులకు పచ్చి రొట్ట ఎరువుల సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

పరవాడ: ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు ప్రధాన పంటల సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువులను వినియోగించడం ద్వారా భూసారాన్ని పెంపొందించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి ఎం.రమాదేవి రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలో ప్రకృతి సేద్యం చేస్తున్న దిబ్బలగొర్లివానిపాలెం, వెన్నలపాలెం గ్రామాల రైతులకు పచ్చిరొట్ట ఎరువుల వినియోగంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఖరీఫ్ సాగు రైతులు వ్యవసాయ శాఖ ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు పొంది వాటిని సాగు భూమిలో వేయాలన్నారు. ఏపుగా పెరిగిన తరువాత వరి పంట వేసే ముందు పచ్చిరొట్ట ఎరువును బాగా కలియ దున్నడం ద్వారా భూసారాన్ని పెంచుకోవచ్చన్నారు. అదేవిధంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన 150 క్వింటాళ్ల వరి విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. సాంబమసూరి 70 క్వింటాళ్లు, ఆర్‌జీఎల్ 2557 రకం 70 క్వింటాళ్లు, ఆర్ఎస్ఆర్ 15048 రకం 5 క్వింటాళ్లు, ఎంటీయూ 1224 రకం 6 క్వింటాళ్లు, ఎంటీయూ 1318 రకం 2 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాలను సందర్శించి విత్తనాలను పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు ఎస్.నారాయణరెడ్డి, ఎం.ఎస్.మూర్తి, వ్యవసాయ సహాయకులు హెచ్.అనిత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆదర్శ్' విద్యార్థులకు ధ్రువపత్రాల పంపిణీ



ధ్రువపత్రాలు అందిస్తున్న కరస్పాండెంట్ థియోఫిలాస్, సిబ్బంది

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్‌ను పూర్తి చేసిన 80 మంది విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఎస్.ఇ.ఫ్లోరా చేతుల మీదుగా వీటిని అందజేశారు. కళాశాల సిబ్బంది, శిక్షణ కేంద్రం ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణంపైనే భవిష్యత్తు చర్చ



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

అగనంపూడి: పెరుగుతున్న ఉష్ణ తాపం, మియావాకీ అరణ్య ప్రణాళిక, నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ వంటి అంశాలపైనే భవిష్యత్‌లో ప్రముఖంగా చర్చ జరగాల్సిన పరిస్థితి ఉంటుందని వైల్డ్ ఎయిడ్ వ్యవస్థాపకులు విమల్‌రాజ్, విజ్ఞాన్ ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు అన్నారు. సీఐఐ యంగ్ ఇండియన్స్ యువ ఫీచర్ 5.0 కార్యక్రమాన్ని జగ్గరాజుపేటలోని విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో వక్తలు, విద్యార్థులు ఉష్ణతాపం, నీటి సంరక్షణ, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, వాటి ప్రభావాలపై అభిప్రాయాలు వెల్లడించారు. రానున్న రోజుల్లో ఈ మూడు అంశాలు తీవ్ర రూపం దాల్చనుండడంతో వీటిపై పరిశోధనలు, చర్చలు జరపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించగా మొదటి రెండు స్థానాల్లో విజ్ఞాన్ మహిళా కళాశాల విద్యార్థుల బృందాలు బహుమతులు దక్కించుకున్నాయి. కార్యక్రమంలో ఈస్ట్‌కోస్ట్ కన్జర్వేషన్ టీమ్ వ్యవస్థాపకులు తమరపల్లి ప్రణవ్, కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి, యంగ్ ఇండియన్స్ చాప్టర్ ప్రతినిధులు బిక్కిన శ్రావణి, కొడాలి దీపా తదితరులు పాల్గొన్నారు.

సీఈటీపీ నుంచి చెరువులు, కాలువల్లోకి వ్యర్థ రసాయనాలు

యాజమాన్యాలపై చర్యలకు సిటు నేత గనిశెట్టి డిమాండ్



సీఈటీపీ కాలువల ద్వారా ప్రవహిస్తున్న వ్యర్థ రసాయన జలాలను చూపుతున్న గనిశెట్టి

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో నిబంధనలకు విరుద్ధంగా కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(సీఈటీపీ) నుంచి ఫార్మా వ్యర్థ జలాలను చెరువులు, కాలువల్లోకి విడుదల చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సీఈటీపీ నుంచి కాలువ ద్వారా ప్రవహిస్తున్న వ్యర్థజలాలను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వ్యర్థ రసాయనాలను శుద్ధి చేయకుండా బయటకు వదిలేయడంతో పరిసర గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. వర్షం పడిన ప్రతిసారీ ఫార్మా పరిశ్రమల నుంచి వ్యర్థ రసాయనాలను పెద్ద ఎత్తున కాలువల్లోకి వదిలేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యర్థ రసాయనాలు మొల్లోడి గెడ్డలోకి చేరి తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నాయని పేర్కొన్నారు. దీంతో స్థానిక ప్రజలు, మూగ జీవాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. ఇక్కడి గెడ్డలో గతంలో పీసీబీ అధికారులు తీసిన నమూనాల్లో పరిశ్రమలు సీటీవో అండ్ హెచ్‌డబ్ల్యూఏ నిబంధనలు పాటించట్లేదని నిర్ధారించారని పేర్కొన్నారు. ఫార్మా యాజమాన్యాలు విడిచిపెడుతున్న వ్యర్థ రసాయనాలపై నోటీసులిచ్చి చేతులు దులిపేసుకోకుండా, యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర పీసీబీ బోర్డుకు ఫిర్యాదు చేస్తున్నట్లు వెల్లడించారు. మొల్లోడి గెడ్డలో చేరిన వ్యర్థ రసాయనాలను మోటార్లతో వెంటనే తొలగింపు చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

నేత్ర పర్వంగా సిరిమానోత్సవం

కూర్మన్నపాలెం: వడ్లపూడి వాసుల ఆరాధ్య దేవత రథాలమ్మ ఉత్సవం మంగళవారం రాత్రి అంగరంగవైభవంగా సాగింది. మేళతాళాలు, భాజా భజంత్రీలు నడుమ రామాలయం వద్ద రాత్రి 9 గంటల ప్రాంతంలో సిరిమాను రథం కదిలింది. సిరిమానును పూజారి ప్రగడ అప్పలనాయుడు అధిరోహించగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ముందుకు నడిపించారు. వేలాదిమంది భక్తులు హర్షధ్వానాల మధ్య జరిగిన కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఇతర ప్రముఖులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం రథం ముందు పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, నాయకులు కోమటిశ్రీను,గుడివాడ లతీష్,ప్రగడ వేణు, బొడ్డగోవింద్,దానప్పలు తదితరులు రథాన్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా బంగారమ్మతల్లి పండగ

విశేషంగా అనుపు మహోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న గంట్ల శ్రీనుబాబు



బంగారమ్మతల్లికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత బంగారమ్మతల్లి పండగ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ప్రియాగార్డెన్స్‌లో ఉన్న అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు పసుపు కుంకుమలు, చీరలు సమర్పించారు. అమ్మవారి పండగను పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో ఆలయం వద్ద భక్తులకు ఉచిత ప్రసాదాన్ని అందజేశారు. గ్రామ సాంప్రదాయం ప్రకారం రాత్రి అనుపు మహోత్సవం వైభంగా జరిగింది. పాత అడవివరంలోని బంగారమ్మతల్లి సతకంపట్టు నుంచి పూజారి వంశస్తులైన లండ కుటుంబీకులు ఘటాలను శిరస్సుపై పెట్టుకుని ప్రియాగార్డెన్స్‌లోని ఆలయానికి పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. దారిపొడవునా అమ్మవారికి గ్రామస్తులు జేజేలు పలికారు. అనుపు ఉత్సవం సందర్భంగా సింహాచలం దేవస్థానం పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసింది. సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.





పొడుగంటిమయ్యా..

వేసవి అరుతడి పంట గంటి చేను నిలువెత్తున ఎదిగి.. రైతుల కళ్లల్లో ఆనందాన్ని నింపుతోంది. నియోజకవర్గంలో పలు చోట్ల రైతులు ఈ ఏడాది అరుతడి పంటలుగా గంట్లు, నువ్వులు, రాగులు తదితర పంటలు వేశారు. మండు వేసవిలో కూడా అడపాదడపా వర్షాలు కురవడంతో ఎలాంటి ఆటంకాల్లేకుండా చేలు ఏపుగా పెరిగాయి. వచ్చే నెల మొదటి వారానికల్లా పంట కోతకు వస్తుందని రైతులు ఆనందంగా చెప్తున్నారు.

- పెందుర్తి

అల్లిగెడ్డ ఆక్రమణలపై రైతుల ఆగ్రహం

పొక్లెయిన్‌తో ఆక్రమణల్ని తొలగించిన టెక్కలిపాలెం రైతులు



అల్లిగెడ్డపై అక్రమంగా ఏర్పాటు చేసిన కల్వర్టు వద్ద రైతులు, రెవెన్యూ అధికారులు



గెడ్డవాగులో అక్రమ కల్వర్టును అడ్డుకుంటున్న రైతులు, రెవెన్యూ అధికారులు

సబ్బవరం: మండలంలోని టెక్కలిపాలెం రైతులు తమ భూములకు సాగునీటిని అందించే అల్లిగెడ్డ ఆక్రమణలపై ఆందోళనకు దిగి, పొక్లెయిన్‌తో మంగళవారం తొలగించారు. గెడ్డవాగుకు సరిహద్దుల్ని గుర్తించి ఆక్రమణలను పూర్తిగా తొలిగించాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను కోరారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు దొగ్గ చిన్నయ్య, పైల రమణ తదితరులు మాట్లాడుతూ అల్లిగెడ్డ నుంచి వచ్చే నీటి ఆధారంగా తమ పూర్వీకుల నుంచి భూముల్ని సాగు చేస్తున్నామన్నారు. ఈ గెడ్డ బంగారమ్మపాలెం నుంచి యాతపాలెం, ఆరిపాక మీదుగా టెక్కలిపాలెంలోని పలు సాగునీటి చెరువులకు జల వనరులను అందిస్తోందన్నారు. సుమారు 54 అడుగుల వెడల్పున విస్తరించి ఉన్న ఈ గెడ్డ టెక్కలిపాలెంలోని పారమ్మ చెరువు, కోనేటి చెరువు, గవరవాని చెరువు, జమ్మునిపాత్రుని చెరువుతో పాటు నాయనమ్మపాలెం, అంతకాపల్లిలోని ముసిడి బంద, రాజ్ చెరువులకు ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. ఆరిపాక రెవెన్యూ పరిధి టెక్కలిపాలెం సరిహద్దులోని సర్వే నెం.5లో 1.06 ఎకరాలు, సర్వే నెం.8లో 1.04 ఎకరాలు, సర్వే నెం.14లో 2.50 ఎకరాలు కలిసి మొత్తం 4.60 ఎకరాల వరకూ గెడ్డవాగు ఆక్రమణకు గురైనట్లు ఆరోపించారు. దీనిని కొంత మంది రైతులు ఆక్రమించుకుని గెడ్డకు మరోవైపు ఉన్న గట్టుకు ఓ ప్రైవేట్ లేఅవుట్ కోసం రహదారి ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. దీనికి ఇరిగేషన్ అధికారుల నుంచి ఏ విధమైన అనుమతులు లేనప్పటికీ, అధికారులు చర్యలు తీసుకోలేదని ఆక్షేపించారు. దీంతో పాటు ఇటీవల యాతపాలేనికి చెందిన మరి కొందరు గెడ్డను ఆక్రమించి, గెడ్డలో కల్వర్టు ఏర్పాటు చేసి తమ భూములకు రోడ్డు వేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పొక్లెయిన్ సాయంతో దాన్ని తొలగించారు. అధికారులకు ఫిర్యాదు చేయగా.. ఆరిపాక వీఆర్వో అప్పలరాజు, టెక్కలిపాలెం వీఆర్వో కామరాజు, సర్వేయర్ రవి తేజ, వీఆర్ఏ నర్సింగరావు తదితరులు పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదించి, చర్యలు తీసుకుంటామన్నారు. ఆందోళనలో రైతులు పంచాడ శ్రీను, గొంప నాయనప్ప, సిరికి శ్రీను, బర్ల శ్రీను తదితరులు ఉన్నారు.